## 'కరెంట్'తో వ్యాపారం పుంజుకుంది..



జనగామ చౌరస్తా, నవంబర్ 29 : బేకరిలో రకరకాల ఫుడ్ ఐటెమ్స్ తయారు చేయాలన్నా, వాటిని నిల్వ ఉంచాలన్నా మాకు కరెంట్ తప్పనిసరిగా అవసరం. ఒక్క మాటలో చెప్పాలంటే కరెంట్‌తో మా బిజినెస్ కనెక్ట్ అయి ఉంటుంది. గత ప్రభుత్వాల హయాంలో రోజుకి మూడు, నాలుగు గంటలే కరెంట్ ఇచ్చేది. దాంతో మా బిజినెస్ బాగా దెబ్బతినేది. ఇవాళ కరెంట్ పోవడమనేది చాలా తక్కువ. ఎలక్ట్రానిక్ ఓవెన్ (బట్టి) సహాయంతో కేకులు, ఎగ్ పప్స్, కర్రీ పప్స్, పిజ్జాలు, బర్గర్లు, బ్రెడ్‌లు తయారు చేసి విక్రయిస్తున్నాం. కస్టమర్లను ఆకర్షించడానికి బేకరి లోపల, బయట విధ్యుత్ కాంతులు విరజిమ్మేలా ఎలక్ట్రిక్ బల్బ్‌లతో అలంకరిస్తున్నాం. దాంతో వినియోగదారుల తాకిడి పెరిగి అందరి వ్యాపారాలు పుంజుకున్నాయి.

*- ఎండీ జహీర్ అహ్మద్, బేకరీ నిర్వాహకుడు, జనగామ*

## 'ధరణి'తో సులువుగా రిజిస్ట్రేషన్..



జనగామ చౌరస్తా, నవంబర్ 29 : గతంలో వ్యవసాయ భూములు మన పేరుమీద చేసుకోవడానికి ఆఫీసుల చుట్టు కాళ్లరిగేలా తిరిగేది. అధికారులు ఒకరు అందుబాటులో ఉండకపోయేది. పొలం పనులు ఇడిసిపెట్టి పట్టా పాసు పుస్తకాల కోసం నెలల తరబడి ఎదురుచూసేది. 'ధరణి' వచ్చాక ఆ పరిస్థితి పూర్తిగా మారింది. మనకు వీలున్న రోజు, అనుకున్న సమయానికి రిజిస్ట్రేషన్ కోసం ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకుంటున్నం. 'ధరణి'తో సులభంగా రిజిస్ట్రేషన్ అయితంది. వారం, పదిరోజుల్లో కొత్త పాసు పుస్తకం రైతుల ఇంటికే వస్తంది. రైతు పక్షపాతి అయిన సీఎం కేసీఆర్ ముందు చూపుతో రైతులకు ఏ కష్టం రాకుండా ఆదుకుంటుండు. పెద్దాయన (కేసీఆర్)కు రైతులంతా రుణపడి ఉంటరు.

*- కంజర్ల మురళి, ఆదర్శ రైతు, గోవర్ధనగిరి*



# గ్రామాలకు చేరిన పోలింగ్ సామగ్రి



శామీర్‌పేట పోలింగ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో అనిల్‌కుమార్

జనగామ రూరల్, నవంబర్ 29 : శాసనసభ ఎన్నికలకు ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఎన్నికల నిర్వహణకు గ్రామాలకు సిబ్బందిని పంపించారు. మండలంలోని 42పోలింగ్ స్టేషన్లకు ఎన్నికల సిబ్బందిని కేటాయించారు. వారంతా బుధవారం సాయంత్రం ఈవీఎంతో పోలింగ్ కేంద్రాలకు చేరారు. మండలంలోని శామీర్‌పేట గ్రామంలోని పోలింగ్ స్టేషన్‌ను జడ్పీ సీఈవో అనిల్‌కుమార్ పరిశీలించారు. ఏర్పాట్లను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎన్నికల సజావుగా నిర్వహించేందుకు ఎన్నికల అధికారులు కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంసీసీ టీం అధికారి ఉప్పుగల్లు సంపత్‌కుమార్, ఏఎస్సై శ్రీనివాస రాజు, పంచాయతీ కార్యదర్శి ఇష్తీకారుద్దీన్ పాల్గొన్నారు.

### బచ్చన్నపేట చేరిన సిబ్బంది..

బచ్చన్నపేట, నవంబర్ 29 : మండలంలో ఈ నెల 30 (నేడు) జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సిబ్బంది సుమారు 282మంది వరకు బుధవారం సాయంత్రం ఆయా గ్రామాలకు చేరుకున్నారు. 47పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలతో సిబ్బంది చేరుకున్నట్లు తహసీల్దార్ విశాలాక్షి తెలిపారు. కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. అన్ని వసతులు కల్పించామన్నారు. కాగా గోపాల్‌నగర్‌కు చేరుకున్న సిబ్బందికి ఎంపీడీవో రఘురామకృష్ణ స్వాగతం పలికారు. గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో లైటింగ్, వసతుల కల్పన పూర్తి అయింది. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి కవిత, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.



బచ్చన్నపేట : గోపాల్‌నగర్‌కు చేరిన ఎన్నికల సిబ్బందితో ఎంపీడీవో రఘురామకృష్ణ

## 'ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి'

రఘునాథపల్లి, నవంబర్ 29 : మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రశాంత ఎన్నికలకు సహకరించాలని ఎస్సై రఘుపతి కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల్లో నేడు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్ ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగావ్యవహరించిన వారిపై చట్టరీత్యా చర్యలు ఉంటాయన్నారు.

## నగదు పంచుతున్న వ్యక్తులపై కేసు నమోదు

స్టేషన్ ఘన్‌పూర్, నవంబర్ 29 : నియోజకవర్గ కేంద్రంలోని బస్టాండు సమీపంలో బుధవారం రాత్రి ఓటర్లకు ఓటర్ స్లిప్పులతోపాటు నగదు పంచుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులను పట్టుకున్నారు. రూ. 15,500 నగదు స్వాధీనం చేసుకుని పార్టీకి చెందిన తాటికాయల సంతోష్, తాటికొండ మోహన్ అనే ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు సీఐ సట్ల రాజు తెలిపారు.

## గంగదేవిపల్లిని సందర్శించిన ప్రతినిధుల బృందం

గీసుగొండ, నవంబర్ 29 : జాతీయ ఆదర్శ గ్రామం గంగదేవిపల్లిని బుధవారం శ్రీలంక దేశంలోని రెహామా అనే స్వచ్ఛంద సంస్థలో పని చేస్తున్న ప్రతినిధుల బృందం బాల వికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సందర్శించారు. ఈ సందర్భంగా వారు గ్రామంలో తిరిగి గ్రామాభివృద్ధిని పరిశీలించారు. అనంతరం గ్రామాభివృద్ధి గురించి శిక్షణ మేనేజర్ కూసం రాజమౌళి వారికి వివరించారు. బాలవికాస సంస్థ గంగదేవిపల్లి గ్రామం అభివృద్ధికి దిశానిర్దేశం చేసిందన్నారు. అనేక స్వచ్ఛంద సంస్థలు గ్రామాభివృద్ధిలో తమ సహాయ సహకారాలు అందించాయని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం గ్రామానికి రూ.10 కోట్ల నిధులను కేటాయించడంతో గ్రామం మరింత అభివృద్ధి సాధించినట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ పాల్గొన్నారు.



బ్యాలెట్ యూనిట్‌ను పరిశీలిస్తున్న ఎన్నికల అధికారులు



పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్తున్న సిబ్బంది

# పోలింగ్ కేంద్రాలకు తరలిన సిబ్బంది

### జనగామ నియోజకవర్గంలో 277పోలింగ్ కేంద్రాలు



జిల్లా కేంద్రం నుంచి ఎన్నికల నిర్వహణకు తరలివెళ్లేందుకు సిద్ధమవుతున్న అధికారులు, సిబ్బంది

జనగామ చౌరస్తా, నవంబర్ 29 : పట్టణ కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్/కళాశాలలో జనగామ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన ఎన్నికల సిబ్బందికి బుధవారం ఈవీఎం, వీవీ ప్యాట్, కంట్రోల్ యూనిట్ల తోపాటు ఇతర ఎలక్షన్ సామగ్రిని రిటర్నింగ్ అధికారి మురళీకృష్ణ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ప్రత్యేక బస్సుల్లో పోలీసు బందోబస్తు నడుమ ఎన్నికల సిబ్బంది నియోజకవర్గంలోని మొత్తం 277పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లారు. జనగామ నియోజకవర్గంలో ప్రిసైడింగ్ ఆఫీసర్లు (పీవో)175, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్లు (ఏపీవో) 175, అదర్ ప్రిసైడింగ్ ఆఫీసర్లు (ఓపీవో) 350 చొప్పున మొత్తం 700మంది సిబ్బంది ఎన్నికల విధులు నిర్వహిస్తున్నారు. రిజర్వ్ పోలింగ్ పర్సనల్ (20 శాతం) పీవోలు 35, ఏపీవోలు35, ఓపీవోలు 70 మంది చొప్పున మొత్తం 140మంది సిబ్బంది ని అందుబాటులో ఉంచారు. నియోజకవర్గంలో అదర్ డిస్ట్రిక్ట్ పోలింగ్ పర్సనల్‌గా పీవోలు 102, ఏపీవోలు 102, ఓపీవోలు 204మంది చొప్పున 408మంది ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారు. అదర్ డిస్ట్రిక్ట్ రిజర్వ్ పోలింగ్ పర్సనల్‌గా (20 శాతం) పీవోలు 21, ఏపీవోలు 21, ఓపీవోలు 42 మంది చొప్పున 84 మందిని అందుబాటులో ఉంచారు. ఒక్క జనగామ అసెంబ్లీ నియోజకవర్గంలోనే పీవోలు 333, ఏపీవోలు 333, ఓపీవోలు 666 కలిపి మొత్తం 1332 మంది సిబ్బంది ఎన్నికల విధులు నిర్వహిస్తున్నారు. ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాల్లో సిబ్బందిని 33టీమ్‌లుగా విభజించి పోలింగ్ స్టేషన్‌ల వారీగా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి ఈవీఎం, వీవీప్యాట్, కంట్రోల్ యూనిట్ బాక్సులు అందజేశారు. మాస్టర్ ట్రెయినర్స్ సమక్షంలో ఎన్నికల విధుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యల గురించి మరోసారి అవగాహన కల్పించారు. తమకు కేటాయించిన ఈవీఎంలు, వీవీప్యాట్, కంట్రోల్ యూనిట్ల పనితీరును సిబ్బంది క్షుణ్ణంగా పరిశీలించుకున్న తర్వాత పోలీసు బందోబస్తు నడుమ ప్రత్యేక బస్సుల్లో పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి జిల్లా ఎన్నికల అధికారి సీహెచ్ శివలింగయ్య నేతృత్వంలో జిల్లాలోని జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేశారు.

## 'ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి'

నెల్లికుదురు, నవంబర్ 29: నేడు అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ బందోబస్తులో 120 మంది సిబ్బంది విధులు నిర్వహించనున్నట్లు నెల్లికుదురు ఎస్సై కే క్రాంతి కిరణ్ తెలిపారు. మండల కేం ద్రంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండల వ్యాప్తంగా 55 కేంద్రాల్లో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా, పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు 55మంది ఛత్తీస్‌గఢ్ హోంగార్డులు, 24 మంది బీఎస్‌ఎఫ్ సిబ్బంది, 20 మంది నెల్లికుదురు పోలీస్ స్టేషన్ సిబ్బంది బందోబస్తులో విధుల్లో ఉంటారన్నారు. మండలంలోని ఎర్రబెల్లిగూడెం, నైనాల, వావిలాల, మేచరాజుపల్లి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద ఒక్కో పోలింగ్ కేంద్రానికి ఆరుగురు చొప్పున 24 మంది ప్రత్యేక బీఎస్‌ఎఫ్ సిబ్బంది విధులు నిర్వహించనున్నట్లు తెలిపారు. అన్ని కేంద్రాల్లో పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు సీఐ, ముగ్గురు కానిస్టేబుళ్లతో స్ట్రైకింగ్ ఫోర్స్ బృందం పర్యవేక్షణ ఉంటుందన్నారు. మండలంలో బందోబస్తును ఒక సీఐ, ముగ్గురు ఎస్సైలు, 20మంది పోలీసులతో ప్రత్యేక బృందం ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయనున్నట్లు తెలిపారు.

## ఓటరు స్లిప్‌లు అందని వారు హెల్ప్‌లైన్ ద్వారా చూసుకోవాలి



బయ్యారం: పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

మహబూబాబాద్, నవంబరు 29: ఓటరు సమాచార స్లిప్‌లు అందని వారు ఓటర్ హెల్ప్‌లైన్ ద్వారా చూసుకొని ఓటు హక్కు వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కే శశాంక బుధవారం తెలిపారు. ఓటరు ఫొటో గుర్తింపు కార్డు (ఎపిక్)లేని వారు ప్రభుత్వం ద్వారా లభించిన ఆధార్ కార్డు, జాతీయ గ్రామీణ ఉపాధిహామీ జాబ్ కార్డు, బ్యాంక్ పాస్ పుస్తకం, కార్మిక శాఖ వారు జారీ చేసిన ఆరోగ్య బీమా కార్డు పాన్ కార్డు, ఆర్‌బీఐ జారీ చేసిన స్మార్టు కార్డు, పాస్‌పోర్టు, పెన్షన్ ధ్రువీకరణ పత్రం, ఉద్యోగులకు జారీ చేసే పబ్లిక్ లిమిటెడ్ కంపెనీ ఉద్యోగుల గుర్తింపు కార్డు, పార్లమెంట్, శాసన సభ్యులు, ఎమ్మెల్సీలు జారీ చేసే కార్డు, దివ్యాంగులకు జారీ చేసిన కార్డులలో ఏదైనా ఒకటి వెంట తెచ్చుకొని ఓటు హక్కు వినియోగించుకోవాలని పేర్కొన్నారు.